# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 269 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 25 సెప్టెంబర్ 2025


## "ఖజానాలో కళాకారులు" పుస్తక ఆవిష్కరణ



3లో

## పరకాల ఆర్టీసీ ప్రయాణికుల కోసం లక్కీ డ్రా




# మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణం

● రూ 525.36 కోట్ల వ్యయంతో పనులు ● ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి



**ఖమ్మం,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగర ప్రజల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ 525.36 కోట్ల వ్యయంతో మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణలో విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెటింగ్, వర్తక, వ్యాపార రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఖమ్మం అగ్రగామిగా నిలుస్తుంది. అయితే ఖమ్మం నగరం మధ్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగు ప్రతి ఏటా వర్షాకాలంలో ఉధృతంగా పొంగి, పరిసర ప్రాంతాల ఇండ్లు, వర్తక , వ్యాపార సంస్థలు, పంటలు వరద ముంపునకు గురవు తున్నాయి. మారిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వస్తున్న ఆకస్మిక వర్షాలు, క్లౌడ్ బస్ట్ లతో ప్రభుత్వ మౌళిక వసతులకు కూడా మిగతా2లో...

## గ్రూప్-1 విజేతలకు

# ఊరట

● పునఃమూల్యాంకన ఆదేశాలపై స్టే ● సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేసిన ధర్మాసనం ● అక్టోబర్ 16కు విచారణ వాయిదా



**హైదరాబాద్,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఈ అంశంలో టీజీపీఎస్సీకి హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. గ్రూప్-1 నియామకాలు చేపట్టుకోవచ్చని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చేనెల 16కి వాయిదా వేసింది.గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించింది. మెయిన్స్ జవాబు పత్రాలను 8 నెలల్లో పునఃమూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ మిగతా2లో...


## విజయవాడలో ఉపరాష్ట్రపతి

# పర్యటన

● ఘనంగా స్వాగతం పలికిన గవర్నర్, చంద్రబాబు తదితరులు ● ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న రాధాకృష్ణన్ ● పున్నమి ఘాట్‌లో విజయవాడ ఉత్సవ్‌కు హాజరు ● ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నపూర్ణ అంటూ కితాబు



**విజయవాడ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** తొలిసారి విజయవాడకు వచ్చిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. బుధవారం ఇంద్రకీలాద్రి ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి ఎండోమెంట్ కమిషనర్ సీహెచ్ రామచంద్ర మోహన్, మంత్రి పార్థసారథి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్చంద్, బోర్ర గాంధీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ- సభ్యులను, మీడియా మిత్రులను కలిసి వైస్ ప్రెసిడెంట్ షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఆపై ఇంద్రకీలాద్రి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచరం పొందారు. తరువాత అమ్మవారి మిగతా2లో...



## బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు

# ముగింపు

అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్న ప్రజలు

నితీశ్ కుమార్‌ను భారంగా భావిస్తున్న బిజెపి

ఎన్‌డిఎలో తారాస్థాయికి అంతర్గత కలహాలు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఖర్గే

**పాట్నా,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బిహార్ ప్రజలు బీజేపీ రెలిజియస్ పోలరైజేషన్‌పై ఏమాత్రం ఆసక్తిగా లేరని, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజకీయాలను కోరుకుంటున్నారని చెప్పారు. బిహార్‌లోని ఎన్డీయేలో అంతర్గత కలహాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నా యని, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ఒక భారంగా బీజేపీ భావిస్తోందని అన్నారు. మిగతా2లో...

## బీహార్‌కు కేంద్రం

# వరాల జల్లు

ఎన్నికల దృష్ట్యా పలు ప్రాజెక్టులకు ఆమోదం

రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులు

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్ల పెంపు: కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల వేళ బిహార్‌పై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్రంలో సుమారు రూ. 6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా వైద్యవిద్య సీట్ల పెంపునకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మిగతా2లో...

## గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా

# హైదరాబాద్

హెచ్‌సీఏ హెల్త్‌కేర్' సంస్థ జిసిసి ప్రారంభం

హైదరాబాద్‌లో సర్వీస్ ప్రారంభించిన శ్రీధర్ బాబు



**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌ను 'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్' సంస్థ గ్లోబల్ క్యాపబిలిటి- సెంటర్ (జీసీసీ)ను ఆయన రాయదుర్గంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్ ప్రధానంగా అమెరికా, యూకేలలో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థకు 190 ఆసుపత్రులు, 2,400 కేర్ సైట్లు- ఉన్నాయి. మొత్తం 3.16 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఫార్చ్యూన్ 100 కంపెనీ వార్షిక ఆదాయం మిగతా2లో...

## గిగ్ వర్కర్లకు ద్రోహం

# చేసిన కాంగ్రెస్

● ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు మోసం ● వారి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం ● గిగ్ వర్కర్లకు కెటిఆర్ భరోసా



**హైదరాబాద్,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. తాము ఎదుర్కొం టున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు- గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ మిగతా2లో...

## బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో పిటిషన్లు

● కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

## లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్

ఉద్రిక్తంగా మారిన ఆందోళన · పోలీస్ కాల్పుల్లో నలుగురు మృతి



**శ్రీనగర్,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ లేహ్ నగరంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు హింసాత్మకంగా మారాయి. ఆందోళన కారులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మృతి చెందారు. మరో 30 మందికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే, పోలీసులు జరిపిన కాల్పుల్లోనే నలుగురు యువకులు మృతిచెందారని, గాయ పడిన వారి సంఖ్య ఎక్కువ ఉందని ఆందోళన కారులు ఆరోపించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాతో పాటు- ఆరో షెడ్యూల్ పొడిగింపు డిమాండ్ చేస్తూ స్థానికంగా కొంతకాలంగా స్థానికంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 10 నుంచి ఓ పదిహేను మంది ఆమరణ దీక్షకు దిగారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో సెప్టెంబర్ 23 సాయంత్రం వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో లద్దాఖ్ అపెక్స్ బాడీ యువజన విభాగం తాజా నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే లేహ్ నగరంలో

మిగతా2లో...

# విజయవాడలో ఉపరాష్ట్రపతి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

లడ్డూ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ఆలయ ఈవో అందజేశారు. తరవాత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి అయ్యాక తొలిసారి విజయవాడ పర్యటనకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నపూర్ణలాంటిది. ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది. విజయవాడ హాట్ సిటీ–.. కూల్ పీపుల్. ఇది అభివృద్ధి చెందిన గొప్ప నగరంగా మారాలి. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వికసిత్ ఆంధ్రప్రదేశ్ దిశగా దూసుకెళ్తోంది. ఈ పర్యటనను నా జీవితంలో మరిచిపోలేను. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి. ప్రజలందరికీ దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి.. జై ఆంధ్రప్రదేశ్‘ అని ఉపరాష్ట్రపతి అన్నారు. అంతకుముందు విజయవాడ పర్యటన నిమిత్తం గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతికి గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి దుర్గమ్మ సన్నిధికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి బయలుదేరి విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొననున్నారు. మరోవైపు ఉపరాష్ట్రపతి దుర్గమ్మ దర్శనం నేపథ్యంలో ఆలయంలో వీఐపీ, వీవీఐపీ దర్శనాలు నిలుపుదల చేశారు. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 6 గంటల వరకు వీఐపీ దర్శనాలు రద్దు చేశారు. వీఐపీలు, వీవీఐపీలు తమకి సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు.

# బీహార్‌కు కేంద్రం వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. బీహార్‌లో రైల్వేకు సంబంధించి రూ. 2192 కోట్లతో భక్తియార్‌పుర్–రాజ్‌గిర్–తిలయ్యా డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక సాహెబ్‌గంజ్–అరెరాజ్–బెతియా మధ్య రూ. 3822 కోట్లతో 78.9 కి.మీ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుతో రాజధాని పట్నా–బెతియా మధ్య కనెక్టివిటీ– మెరుగు పడుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వీటితోపాటు– దేశీయ నౌకా నిర్మాణం, సముద్ర రంగాల పునరుజ్జీవనానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ. 69,725 కోట్ల ప్యాకేజీకి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర కేబినెట్ మరో నిర్ణయం తీసుకుంది. కొత్తగా 5వేల పీజీ సీట్లకు ఆమోదం తెలిపింది. వీటితోపాటు– కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం మూడో ఫేజ్ కింద 2028–29 నాటికి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి మార్గదర్శకాలు జారీ చేయనుంది. దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య సీట్లలో భారీ పెంపునకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. 5,023 ఎంబీబీఎస్ సీట్లను పెంచడానికి, ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడ్ కోసం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఫలితంగా దేశంలో వైద్య విద్య సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేందుకు వీలవుతుంది సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ 3వ దశ కింద ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడేషన్ ద్వారా 5,000 కొత్త పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు–, 5,023 ఎంబీబీఎస్ సీట్లు– పెంచేందుకు ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు– 1,18,190కి, పీజీ సీట్లు– 74,306కి చేరుకుంటాయి. మొత్తం రూ. 15,034.50 కోట్ల బడ్జెట్ (2025–26 నుంచి 2028–29 వరకు)తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ. 10,303.20 కోట్లు– కాగా.. రాష్ట్రాల వాటా రూ. 4,731.30 కోట్లు. ఈ విస్తరణ వైద్యులు, స్పెషలిస్టుల సంఖ్యను పెంచి గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థులకు మరిన్ని వైద్య వృత్తి అవకాశాలు, ఉద్యోగాలు సృష్టించడంతోపాటు– భారతదేశాన్ని సరసమైన ఆరోగ్య సేవల గ్లోబల్ హబ్‌గా మార్చుతుంది. ఇప్పటికే దేశంలో 808 మెడికల్ కళాశాలలో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లు– ఉన్నప్పటికీ, డిమాండ్‌కు తగ్గట్టు సామర్థం పెంచడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మార్పుల అమలుకు మార్గదర్శకాలు వెంటనే జారీ చేస్తుంది. ఈ నిర్ణయం యూనివర్సల్ హెల్త్ కవరేజ్ లక్ష్యాన్ని సాకారం చేస్తూ, దేశ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందని నిపుణులు అంటున్నారు.

# మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర నష్టం జరుగుతున్నది. పనులకు వెళ్ళిన వారు, ఇంటికి వచ్చి సామాన్లు, నిత్యావసరాలు సర్దుకునే వెసులుబాటు– లభించదు. దీనితో వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి, కట్టు– బట్టలతో రోడ్డున పడుతున్నాయి. రోడ్లు ,విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్లు, పాఠశాల భవనాలు, తాగునీటి వసతు లు, పైపు లైన్లు , ఆరోగ్య కేంద్రాలు దెబ్బతింటు–న్నవి. రూరల్ మండలం లో పంటలు ముంపుకు గురవుతాయి. ఉదాహరణకు 2024 సెప్టెంబర్లో సంభవించిన క్లౌడ్ బస్ట్ తో మున్నేరుకు వచ్చిన ఆకస్మిక వరద ముంపుతో ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు రూ. 757 కోట్ల నష్టం జరిగినట్లు– అధికారులు అంచనా వేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పర్యటించి, బాధిత కుటు–ంబాలను పరామర్శించారు. మున్నేరు వాగు రివిట్‌మెంట్ వాల్ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు వాగుకు 5,863 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నుండి గరిష్టంగా 10 వేల క్యూమెక్స్ వరద ప్రవహిస్తుంది. ఖమ్మం నగరం మద్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగుకు ఎడమ వైపు డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా 379 క్యూమెక్స్ , కుడి వైపు డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా 605 క్యూమెక్స్ వరద డిశ్చార్జ్ అవుతుంది. పరివాహక ప్రాంతం, నగరం నుంచి వచ్చే వరద గరిష్ట స్థాయిని దృష్టిలో ఉంచుకుని, మున్నేరు వాగుకు రెండు వైపుల సిమెంట్ కాంక్రీట్ రక్షణ గోడ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. మున్నేరు వాగు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రూ. 525.36 కోట్ల వ్యయంతో మున్నేరు వాగు కు రెండు వైపుల నిర్మాణం పనులను 2024 మార్చి నెలలో ప్రారంభించారు. మున్నేరు వాగుకు రెండు వైపుల ఖమ్మం రూరల్ మండలంలో 8.5 కిలోమీటర్లు, ఖమ్మం అర్బన్ మండలంలో 8.5 కిలోమీటర్లు మొత్తం 17 కిలోమీటర్లు పొడవున 10–15 మీటర్ల ఎత్తున రి–టైనింగ్ వాల్ తో పాటు–, సర్వీసు రోడ్డు , డ్రైనేజ్ వ్యవస్థ సదుపాయంతో ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. పనుల నాణ్యతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది. వరంగల్ కఒ÷ు నిపుణులతో పనుల ప్రమాణాలను తనిఖీ చేయిస్తున్నది. పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నారు. ఖమ్మం అర్బన్ మండలంలో మల్లేమడుగు, దానవాయి గూడెం, బుర్హాన్ పురం, ఖమ్మం గ్రామాలు , ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి, గొల్లపాడు, గుడిమల్ల, గుర్రాలపాడు, ఏదులాపురం గ్రామాలకు చెందిన మొత్తం 245.12 ఎకరాల భూసేకరణలో 106.21 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. 138.31 ఎకరాల పట్టా భూమిలో ఇప్పటివరకు 69.12 ఎకరాలను సేకరించడం జరిగింది. భూ సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతున్నది. నిర్వాసితులకు పరిహారంతో పాటు–, ఇండ్ల స్థలాలు కేటాయించుటకు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామంలో 139.27 ఎకరాల్లో లే–అవుట్ ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నది. ఈ లే–అవుట్ నందు 1,666 కుటు–ంబాలకు ఇండ్ల స్థలాలు కేటాయించనున్నారు. అన్ని మౌలిక వసతులతో మోడల్ కాలనీగా ఇది అభివృద్ధి చెందుతుంది. మున్నేరు రీ–టైనింగ్ వాల్ పనులు పూర్తయితే, ఖమ్మం పురోభివృద్ధికి మైలు రాయిగా నిలుస్తుంది. దశాబ్దాల సమస్యను పరిష్కరించిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుంది.

# గ్లోబల్ హెల్త్ కేర్ హబ్‌’గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

70 బిలియన్ డాలర్లు అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఇలాంటి దిగ్గజ సంస్థ అమెరికా వెలుపల భారత్‌లో తన మొట్టమొదటి జీసీసీని ఏర్పాటు– చేసేందుకు తెలంగాణను ఎంచుకోవడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఇది హైదరాబాద్‌కు ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులకు నిదర్శనం అని పేర్కొన్నారు. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు– చేసిన ఈ కేంద్రంలో హెచ్ సీఏ హెల్త్ కేర్ 75 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 620 కోట్లు–) పెట్టుబడి పెట్టనుందని తెలిపారు. ఈ జీసీసీ కేవలం ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాకుండా ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. ఐటీ–, స్లప్లై చైన్, ప్రొక్యూర్‌మెంట్, మానవ వనరులు, ఫైనాన్స్, అకౌంటింగ్ తదితర విభాగాల్లో ప్రస్తుతం 1200 మందికి, 2026 నాటికి 3 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. హైదరాబాద్ గ్లోబల్ హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు ముఖద్వారంగా ఎదుగుతోందని, ప్రపంచ స్థాయి ఆసుపత్రులు, 800కు పైగా ఫార్మా కంపెనీలు, ప్రముఖ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ జీసీసీలు, అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలతో గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా రూపాంతరం చెందుతోందని వివరించారు. అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూనే సరసమైన ఆరోగ్య సంరక్షణను ప్రపంచానికి అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ఐటీ– సలహాదారు సాయికృష్ణ, హెచ్ సీఏ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మైక్ మార్క్, గ్లోబల్ క్యాపబిలిటీ– సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ డంకన్, హైదరాబాద్ సెంటర్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ అతుల్ కపూర్ తదితరులు పాల్గొన్నారు. హెచ్ సి ఏ హెల్త్‌కేర్ ఓ ప్రముఖ అమెరికన్ హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రొవైడర్‌గా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడిన ఈ కేపబిలిటీ– సెంటర్‌లో ఆర్టిఫిషియల్ ఇం–టె–లిజెన్స్ , మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, అనలిటిక్స్ రంగాలలో ప్రతిభావంతులను తీర్చిదిద్దడంపై దృష్టి సారించనుంది. కాగా జీసీసీ, హెచ్ సి ఏ హెల్త్‌కేర్ కెపబిలిటీ– సెంటర్ గ్లోబల్ ఆపరేషన్స్‌కు కీలకమైన హబ్‌గా పని చేస్తుంది. టెక్నలాజికల్ ఆవిష్కరణలను ప్రోత్సహించి అధిక నాణ్యత గల హెల్త్‌కేర్ అందించేందుకు ఈ సెంటర్ దన్నుగా పని చేయనుంది. 2025 చివరి నాటికి హెచ్‌సీఏ హెల్త్ కేర్ గ్లోబర్ కేపబిలిటీ– సెంటర్ హైదరాబాద్‌లో 75 మిలియన్ డాలర్ల పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఒక్క ఏడాదిలోనే 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు 2026 నాటికి మరో 3 వేల మందికి జాబ్స్ రానున్నాయి.

# బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో పిటిషన్లు

## ● కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయిస్తూ ప్రభుత్వం తెస్తున్న జీవోపై హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సరికాదని పిల్ దాఖలు కాగా... బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ క్రమంలో పిటిషనర్లపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో కథనాల ఆధారంగా పిల్ ఎలా వేస్తారని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పత్రికల్లో వచ్చిన వార్తలను పరిగణలోకి తీసుకోలేమని స్పష్టం చేస్తూ.. రిజర్వేషన్ల అంశంపై దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వుల జారీ చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఆదేశాలు ఇవ్వాలని, 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకోవాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే స్థానిక సంస్థల్లో ఇతర వర్గాలకు అన్యాయం జరుగుతుందని పిటిషనర్లు పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇస్తే 50 శాతం దాటు–తుందని.. సుప్రీంకోర్టు తీర్పు, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 50 శాతం మించకూడదని పిటిషన్లు వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆ రెండు పిటిషన్లను కొట్టివేసింది.

# బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

బిహార్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఓట్ చోరీ అంశంపై బీజేపీని మరింత ఇరకాటంలో పెట్టే విషయమై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం బిహార్ రాజధాని పాట్నాలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయమైన సదాకత్ ఆశ్రమంలో బుధవారంనాడు నిర్వహించారు. ఖర్గే అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నేత రాహుల్ గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్‌పీ నేతలు హాజరయ్యారు. జాతీయంగా, అంతర్జాతీయంగా దేశం పెక్కు సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతోందని ఖర్గే అన్నారు. మోదీ, ఆయన ప్రభుత్వ దౌత్య వైఫల్యాల కారణంగానే అంతర్జాతీయంగా మనం సమస్యలను ఎదుర్కొంటున్నామని విమర్శించారు. మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంపే ఇప్పుడు ఇండియాను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఓటు చోరీ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకతపై ఆందోళనలు తలెత్తుతున్నాయని ఖర్గే అన్నారు. వివిధ రాష్ట్రాల్లో అవకతవకలను రాహుల్ లేవనెత్తుతుంటే వాటిని పరిష్కరించకుండా అఫిడవిట్లు సమర్పిం చాలని ఈసీ ఒత్తిడి తెస్తోందన్నారు. బిహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లను తొలగించేం దుకు ప్రస్తుతం కుట్ర జరుగుతోందని ఖర్గే ఆరోపించారు. ఓట్ చోరీ అంటే రేషన్, పెన్షన్, మెడిసన్, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, పేదల హక్కులను దొంగిలించడ మేనని అన్నారు. ప్రజలు బహిరంగంగానే మోడీ తీరును ఎండగడుతున్నారని మండిపడ్డారు.

# లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

అనేక మంది వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. వీరిని చెదరగొట్టేందుకు వచ్చిన భద్రతా దళాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. స్థానిక భాజపా కార్యాలయానికి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఒక్కసారిగా పరిస్థితులు హింసాత్మకంగా మారాయి. వీటిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన పోలీసులు ఫైరింగ్ చేశారు. అనంతరం లేహ్ జిల్లాలో నిషేధాజ్ఞలు విధించారు. లేహ్‌లో చోటు–చేసుకున్న హింసపై పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాంతియుతంగా చేపట్టిన నిరసనలు ఎలాంటి ఫలితాలు ఇవ్వకపోవడంతోనే యువత నిస్పృహ చెందారన్నారు. ఇవే తాజా ఘటనలకు దారితీశాయన్న ఆయన.. పలువురు యువకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

# గ్రూప్–1 విజేతలకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

లిస్ట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. మెయిన్స్ పత్రాలను పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 8 నెలల్లోపు చేయకపోతే మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. 2011లో గ్రూప్–1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీంకోర్టు రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్–1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో పక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టుకు ఏజీ తెలిపారు. దీనిపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ స్పందిస్తూ మాల్ ప్రాక్టీస్, పేపర్ లీక్‌లాంటి ఘటనలు ఏమైనా చోటు–చేసుకున్నాయా? పక్షపాతం చూపించారనడానికి ఏమైనా ఆధారాలున్నాయా?అని ఏజీని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఏపీలో నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో తెలుగులో రాసిన అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారని చెప్పారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పురుషులకు వాష్‌రూమ్‌లు లేవని.. అందుకే ఆ రెండు కేంద్రాల్లో మహిళలకు మాత్రమే కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు సమీపంలోని కేంద్రాలు కేటాయించామన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు– జారీ చేయడాన్ని సైతం తప్పుబట్టారని ఏజీ తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో టీజీపీఎస్సీకి అధికారం ఉంటుందని.. పరీక్ష కేంద్రాల కేటాయింపును తప్పుబట్టలేమని సీజే అన్నారు. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ డివిజన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని సీజే జస్టిస్ ఏకే సింగ్ స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ స్టే విధించడంతో గ్రూప్–1 ర్యాంకర్లకు ఊరట లభించింది. ఈ తీర్పుతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# గిగ్ వర్కర్లకు ద్రోహం చేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

బోర్డు ఏర్పాటు–, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు– మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని విమర్శించారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తే బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీ–ఆర్ తెలిపారు. కేవలం ఓట్ల కోసం హామీలు ఇచ్చి విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి అలవా–టైపోయిందని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధితో ఉంటే గిగ్ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గిగ్ కార్మికుల సంక్షేమాన్ని కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, వారి భద్రత, గౌరవం, హక్కులను కాపాడటం ప్రభుత్వ నైతిక, రాజకీయ బాధ్యత అని కేటీ–ఆర్ స్పష్టం చేశారు. ’గిగ్ వర్కర్స్’కు కాంగ్రెస్ తీరని ద్రోహం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ–ఆర్ అన్నారు. అభయహస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే రేవంత్ సర్కార్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్క్లంల్గ÷న అహ్మద్ బిన్ అబ్దుల్ ఖదర్, శ్యామ్ సుందర్, లొకుర్తి నరేశ్‌లకు ప్రభుత్వం ప్రకటించిన ...5 లక్షల ప్రమాద బీమా పరిహారం ఇప్పటికీ అందలేదని తెలిపారు. వీరి కుటు–ంబాలు అవసరమైన అన్ని పత్రాలను సమర్పించినప్పటికీ పరిహారం అందలేదన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన గిగ్ వర్కర్స్ కుటు–ంబాలకు తక్షణమే ...5 లక్షల పరిహారాన్ని చెల్లించడంతో పాటు– గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు– చేయాలని డిమాండ్ చేశారు.

# బెట్టింగ్ యాప్‌ల కేసు

## ● ఇడి విచారణకు హాజరైన సోనూసూద్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** బాలీవుడ్ నటుడు సోనూ సూద్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో విచారణకు రావాలని ఈడీ గతంలో సోనూ సూద్‌కి సమన్లు జారీ చేసింది. అయితే కొన్నిరోజులుగా పంజాబ్‌లోనే ఉండి వరద బాధితులకు అండగా నిలిచిన సోనూ తాజాగా ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణలో భాగంగా.. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వాటితో సోనూ సూద్‌కి ఉన్న సంబంధాలు ప్రచారానికి తీసుకున్న డబ్బుల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నట్లు– సమాచారం. ఈ కేసులో ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ఈడీ విచారించింది. ఇటీ–వల సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, నటి మంచు లక్ష్మి, నటు–డు విజయ్ దేవరకొండ, రానా కూడా విచారణకు హాజరయ్యారు. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం, నల్లధనం లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగానే పలువురు సెలబ్రిటీలను ఈడీ ప్రశ్నిస్తోంది.

# కిట్స్ వరంగల్ ఈసీఐఈ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ రంగిసెట్టి నిర్మలా దేవికి డాక్టరేట్

**హన్మకొండ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్) :** వరంగల్ లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (కిట్స్ డబ్ల్యూ) లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ (ఈసీఐఈ) విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న రంగిశెట్టి నిర్మలా దేవికి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్(జె యన్ టి యూ హెచ్) వారు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది. అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో, కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్ నిర్మలా దేవి తన పిహెచ్‌డి థీసిస్‌ను "అనాలిసిస్ అండ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ బ్లైండ్ ఈక్వలైజేషన్ అండ్ మల్టీయూజర్ డిటెక్షన్ సిస్టమ్స్ ఇన్ డిస్పర్సివ్ సి డి ఎం ఏ ఛానెల్స్" అనే సాంకేతిక అంశం పై తన పిహెచ్‌డి థీసిస్‌ను సమర్పించారని హైలైట్ చేశారు. ఆమె తన పరిశోధన పనిని నిట్ వరంగల్ ఫార్మర్ ప్రిన్సిపాల్ అండ్ ఈ సి ఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ కె. కిషన్ రావు పర్యవేక్షణలో తన పరిశోధన చేశారు అని తెలిపారు. భవిష్యత్ తరాల అవసరాలను తీర్చడానికి ఈ డిఎస్-సి సి డి ఎం ఏ పనితీరును మెరుగు పరచడానికి ఆర్. నిర్మలా దేవి టెన్సర్-ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్ మరియు నిర్మాణాత్మక కోడ్ డిజైన్‌ను అభివృద్ధి చేశారు. తన ఫలితాలు మెరుగైన కన్వర్జెన్స్ మరియు కోడ్ అంచనా ఖచ్చితత్వాన్ని ధృవీకరిస్తాయి, సంభావ్య భవిష్యత్తు దిశలు: టెన్సర్ మోడళ్లను ఎం ఐ ఎం ఎ, ఓ ఎఫ్ డి ఎం మరియు 6G (అల్ట్రా వైడ్ బ్యాండ్) వ్యవస్థలకు విస్తరించంబడినాయి. అనుకూల, సందర్భోచిత కోడ్‌బుక్‌లను రూపొందించంబడింది. ఎఫ్ పి జి ఏ లేదా సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో ప్లాట్‌ఫామ్‌లలో రియల్-టైమ్ టెక్నాలజీస్ ను అమలు జరిపారు. ఆమె ప్రసిద్ధ జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్ లలో సాంకేతిక పరిశోధన పత్రాలను కూడా ప్రచురించారు" అని ప్రిన్సిపాల్ సగర్వంగా తెలుపుతూ ముగించారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, ఫార్మర్ రాజ్య సభ ఎం.పి., కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి గారు అండ్ హుస్నాబాద్ ఫార్మర్ ఎమ్మెల్యే , కిట్స్ అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్ గారు , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి గారు ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ప్రస్తుత పరిశోధన రంగంలో సమాజానికి అవసరమైన పరిశోధనలు చేసినందుకు ఆర్ నిర్మలా దేవినీ శుభాకాక్షలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్,



ప్రొఫెసర్ కె వేణు మాధవ్, ప్రొఫెసర్ , ఈసీఐఈ విభాగపు హెడ్, డాక్టర్ కె శివాని, వివిధ విభాగాల డీన్లు మరియు హెడ్స్, అధ్యాపకులు, సిబ్బంది మరియు కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ , పి. ఆర్.ఓ. డాక్టర్ డి. ప్రభాకరా చారి, జె యన్ టి యూ హైదరాబాద్ ద్వారా పిహెచ్‌డి నీ పొందడం పట్ల ఆర్ నిర్మలా దేవిని అభినందించి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచుకున్నారు.

# టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకట్ కందికట్ల నియామకం



**వరంగల్ సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ యూనియన్ (టిడబ్ల్యూజేఎఫ్) వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకట్ కందికట్ల ను నియమిస్తూ టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య తెలిపారు. వరంగల్ నగరంలోని శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్లో టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, అతిథిలుగా సంఘం రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాజశేఖర్, దయాసాగర్, రఘు లు హాజరై వరంగల్ జిల్లా నూతన కమిటీని నియమించడం జరిగింది. వరంగల్ జిల్లా నూతన కమిటీలో కందికట్ల వెంకట్ ను టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు మహాసభల సందర్భంగా వారు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ కందికట్ల మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా నన్ను నియమించినందుకు గాను రాష్ట్ర, జిల్లా యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. వరంగల్ జిల్లాలో ఉన్నటువంటి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని,జర్నలిస్టుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని వెంకట్ కందికట్ల అన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**హన్మకొండ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్) :**బతుకమ్మ వేడుకలను వరంగల్ పోలీస్ కమిషన రేట్ బతుకమ్మ వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ పర్యట మైదానంలో ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమానికి కమిషనర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ అధికారులు, పరి పాలన సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరైన ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ సతీమణి డాక్టర్ దీప్తి మరియు కుమార్తెతో కలిసి ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మహిళ పోలీస్ సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని, తోటి సిబ్బందిని ఉత్సాహపరుస్తూ పోలీస్ కమిషనర్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ బతుకమ్మలకు వరంగల్ పోలీస్ కమిషనర్ దంపతులు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీలు రవి సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్. ఐలు సతీష్, చంద్రశేఖర్, స్పర్జన్ రాజ్, శ్రీధర్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# "ఖజానా లో కళాకారులు" పుస్తక ఆవిష్కరణ

**• పుస్తకాన్ని ఆవిష్కరించిన ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ రాష్ట్ర డైరెక్టర్ కె.ఎస్.ఆర్.సి మూర్తి**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నుండి నేటి వరకు వృత్తితో పాటు ప్రవృత్తిలో భాగంగా అనేకమంది వివిధ కళలలో రాణిస్తున్నారు. అలాంటివారినీ ఒక్కొక్కరిని వారి ప్రతిభ ఆధారంగా, వారు సాధించిన విజయాలను తెలియజేస్తూ "ఖజానా లో కళాకారులు" అనే గ్రంధాన్ని ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ఖాజానా డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ రచించడం జరిగింది. దానిని బుధవారం ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ రాష్ట్ర డైరెక్టర్ కె.ఎస్.ఆర్.సి మూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగంతో పాటు వారిలో ఉన్న కళలను ప్రదర్శించి ఉద్యోగులను సంతోషపరుస్తూ ఎంతోమంది తగిన గుర్తింపును తెంచుకొని అవార్డులు పొందడం చూస్తున్నాము. అటువంటి వారందరిని క్రోడీకరించి చిరస్మరణీయంగా గుర్తుండి పోయేలా పుస్తక రూపంలో అందించిన వెంటపల్లి సత్యనారాయణను ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ రాష్ట్ర డైరెక్టర్ కె.ఎస్.ఆర్.సి మూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ నాగరాజు, ఖమ్మం జిల్లా టిజిఓ కార్యదర్శి మోదుగు వేలాద్రి, సుధీర్,



బాబు, షాబుద్దీన్, నరసింహచారి, పర్వతాలు, రాజగోపాలచారి, రవీంద్రగౌడ్, లావణ్య, రాధా, మహమ్మద్ రఫీ, జయరాం, గురు జగదీశ్వర్, సాయికుమార్, రాజా, జ్యోతిరావు, అజార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిజిఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ భానోతు దస్రు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రసన్నకుమార్, అమృత, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిటీఏ కె.ఎస్.ఆర్.సి మూర్తి, సత్యనారాయణ ప్రతిభను గుర్తించి వారిని ఘనంగా సన్మానించడం జరిగింది.

# భూ భారతి దరఖాస్తుల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేయాలి

**• హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**



**హన్మకొండ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్) :**భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటు న్న చర్యలను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులను పరిష్కరిం చారు, ఇంకా ఎన్ని దరఖాస్తులు పరిష్కరిం చాల్సి ఉందనే వివరాలను తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ భారతి దరఖాస్తులపై నిబంధనల మేరకు విచారణ చేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నాయబ్ తహసిల్దార్ రహీం పాషా, గిర్ధావర్ రాజేంద్ర ప్రసాద్, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా 4వ రోజు బతుకమ్మ వేడుకలు

**• మహిళా మణులతో బతుకమ్మ ఆడి పాడిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందల ఉపేందర్ రెడ్డి**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్)** : నాలుగో రోజైన బుధవారం బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ తో పాటు ముఖ్య అతిథులుగా హాజరైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, భద్రాద్రి జిల్లా మాజీ జిల్లా గ్రంధాలయ చైర్మన్ దిండిగళ్ళ రాజేంద్ర, ఖమ్మం నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, రూరల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ బెల్లం ఉమా, బొమ్మెర రామ్మూర్తి, వైవి ప్రసాద్, పగడాల నరేందర్ ఇతర పార్టీ ముఖ్య నేతలు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మహిళా మణులకు బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ వేడుకలను పెద్దఎత్తున జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తూ.. మహిళా సోదరీమణులకు అన్ని రకాల సౌకర్యాలతో వేడుకలు నిర్వహిస్తున్న తాతా మధుసూదన్ ని



అభినందించారు. అనంతరం మహిళా మణులు ఆడి పాడిన బతుకమ్మ వేడుకలను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు, ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరలను రాష్ట్ర మహిళలందరికీ ఇవ్వాలి

**ప్రజలకు అందించే ప్రతి పథకంలో కోతలు పెట్టటం మంచిది కాదు**

**నేదునూరి జ్యోతి రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**హన్మకొండ,సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్)** :రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ కానుకగా మహిళలకు ఇస్తున్న చీరలను, తెలంగాణలోని మహిళలందరికీ ఇచ్చి గౌరవించాలని నేదునూరి జ్యోతి మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు హసన్ పర్తి మండల కేంద్రంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కేవలం మహిళా పొదుపు సంఘాల సభ్యులకు మాత్రమే చీరలను పంపిణీ చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోందని, ఇది ఎంత మాత్రం మంచిది కాదని కొంతమంది మహిళలకు ఇచ్చి, మహిళలకు ఇవ్వకుండా ఉండటం ఒక రకంగా వారిని అవమానించటమేనని నేదునూరి జ్యోతి అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన తప్పిదాన్ని గుర్తించి, రాష్ట్రం లోని మహిళలందరికీ దసరా కానుకగా చీరలను పంపిణీ చేయాలని కోరారు. కొంతమందికి ఇస్తే లాభం కంటే ప్రభుత్వానికి నష్టం ఎక్కువ జరుగుతుందని ఈ విషయాన్ని పాలకులు గుర్తించాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో దొమ్మాటి ప్రవీణ్ కుమార్, కౌసల్య, రమా, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో నూతనంగా ప్రారంభమైన పౌరహక్కుల పరిరక్షణ సంఘం...




**కరీంనగర్,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):** పౌరుల హక్కుల పరిరక్షణ, వాటిపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కరీంనగర్‌లో పౌరహక్కుల పరిరక్షణ సంఘం మంగళ వారం ఘనంగా ప్రారంభమైంది. హెూటల్ పీకాక్ లో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది రఘునాథ్ వేరేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు డిమాండ్ చేస్తేనే హక్కులు సాధ్యమవుతాయని, "డిమాండ్ లేకుండా హక్కు రాదు" అని స్పష్టం చేశారు. "ప్రస్తుత కాలంలో నిరసన తెలిపే హక్కునే నేరంగా పరిగణిస్తున్న పరిస్థితి ఉంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ హక్కుల కార్యకర్తలు సమాజంలో గౌరవనీయులు, శక్తివంతులుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. "ఆవాజ్ లేని వారి ఆవాజ్"గా ఈ సంఘం పనిచేస్తుందని రఘునాథ్ వేరేజ్ తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో పౌరహక్కుల పరిరక్షణ చాలా అవసరమని ఈ కార్యక్రమానికి వచ్చిన వక్తలు అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గాలకు, పీడితులకు న్యాయం అందించడం ఈ సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి ప్రాథమిక రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచాలని, సమాజంలో న్యాయం-న్యాయేతరం నెలకొల్పడానికి అందరూ సహకరించాలని కోరారు. డాక్టర్ పీక్ ముహమ్మద్ హుస్సేన్, సీనియర్ న్యాయవాది ముహమ్మద్ జమీలుద్దీన్ అహ్మద్, న్యాయవాది నిజాం రాం చందర్, మౌలానా ముహమ్మద్ యూనస్ అలీ, ముహమ్మద్ ఫాసి ఉద్దీన్, ముస్తాక్ అలీ ఖాన్, గద్దెన్ జక్కవల్లి, ఎం.డి. ముజీబ్ అయ్యూబ్, ఖాజా ఆలీంముద్దిన్, అబీద్ రహమాన్, సానుయా హుస్సేన్, ముహమ్మద్ అనిష్, ముహమ్మద్ తఫీద్, ముహమ్మద్ ఫైసల్, ముహమ్మద్ ఇబ్రహీం, పూర్ణపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం...



**తిమ్మాపూర్,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):**గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి-ఖాజీపూర్ గ్రామాల మధ్యగల మానేరు వాగుపై వంతెన నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.77 కోట్ల రూపాయలు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఎల్ ఎం డీ కాలనీలోని ప్రజాభవన్ లో పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చొక్కారావుపల్లి-ఖాజీపూర్ గ్రామాల మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మాణం కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్న గన్నేరువరం మండల వాసుల కోరిక కేంద్రం నిధులు మంజూరుతో ఎట్టకేలకు తీరనున్నదన్నారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడమే కాకుండా నిదుల మంజూరు కోసం సంబంధితశాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు సంప్రదించారన్నారు. అలాగే కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించడానికి గట్టి కృషి చేశారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కొనియాడారు. బండి సంజయ్ కుమార్, రేవంత్ రెడ్డి ల కృషి వల్లనే వంతెన నిర్మాణానికి కేంద్రం 77 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని పేర్కొంటూ వారిద్దరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి,పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డితోపాటు చొక్కారావుపేట గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం








**కరీంనగర్,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని బుధవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ సందర్శించారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హెూల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా మరియు పి.డి.ఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు వన్ టౌన్ రామ్ చందర్ రావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి , త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ఉమెన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీలత తో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధరలో ఎన్.ఎస్.ఎస్. ఆవిర్భావ దినోత్సవం , బతుకమ్మ సంబరాలు







**గంగాధర సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మండలం మధురానగర్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధరలో ఎన్.ఎస్.ఎస్. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని NSS PO ఎల్. సురేష్ కేక్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా LIC మేనేజర్ ఇమ్మానియేల్ గంగాధర , కళాశాల ప్రిన్సిపల్ ఏ. సత్యనారాంజనేయ గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జాతీయ సేవా పథకం గొప్ప ఉన్నత ఆశయంతో విద్యార్థులకు అందించబడిన మహోత్తర సేవా పథకం అని కొనియాడారు. 1969 సెప్టెంబర్ 24వ తేదీన డాక్టర్ వి. కే. ఆర్. కె. వి. రావు గారు కేంద్ర విద్యా శాఖ మంత్రి గారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు అని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక అంశాల పట్ల అవగాహన ఉండాలని సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలని సమాజాన్ని మేలుకొల్పాలని తద్వారా దేశ భవిష్యత్తుకు పునాది వేయబడాలంటే నేషనల్ సర్వీస్ స్కీములో ప్రతి విద్యార్థిని, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనాలని తెలియజేశారు.గౌరవ కళాశాల ప్రిన్సిపాల్ బతకమ్మ సంబరాలను కళాశాలలో ప్రారంభించారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించే బహుగమ్మతైన పండుగ బతుకమ్మ పండుగ అని, తీరొక్క పువ్వులను పేర్చి దైవంగా భావించే పండగ బతకమ్మ పండగ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినిలు ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళా అధ్యాపకురాండ్లు ఎంతో శ్రద్ధ తీసుకొని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాలకు అధ్యాపక బృందం విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# హుజూరాబాద్ చేనేత సహకార సంఘం 72వ వార్షిక మహాసభ: లాభాల బాటలో పయనం...



**హుజూరాబాద్,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి , విక్రయ సంఘం లిమిటెడ్ తమ 72వ వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించుకుంది. సంఘం కార్యాలయం ముందు నిర్వహించిన ఈ సభకు కరీంనగర్ జిల్లా చేనేత , జౌళి శాఖ అధికారి ఎం.ఎ. హజార్ వహబ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సంఘం అధ్యక్షుడు (ఇన్‌చార్జి) ఎలిగేటి ఉపేందర్ చేతుల మీదుగా సహకార పతాకావిష్కరణతో సభ ప్రారంభమైంది. అనంతరం, ఆయన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం సభ్యులు, సిబ్బంది మొత్తం 210 మంది పాల్గొన్నారు.**లాభాల వాటాతో జిల్లాలోనే అగ్రగామి** ఈ సందర్భంగా మాట్లాడిన అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, సంఘం సభ్యులు మరియు సిబ్బంది నిరంతర కృషి వల్ల సంఘం లాభాలతో నడుస్తోందని తెలిపారు. 42 శాతం లాభాల వాటా మరియు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేసి సంఘం జిల్లాలోనే అగ్రగామిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.అలాగే, 'నేతన్నకు భరోసా' పథకంలోని కఠిన నియమాలను తొలగించి, చేనేత కార్మికులందరికీ సంవత్సరానికి రూ. 24,000 అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నేత వృత్తిలో ఉంటూ మరణించిన వారికి వయస్సుతో సంబంధం లేకుండా రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి, చేనేత శాఖ మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.**ప్రభుత్వ పథకాల అమలుకు కృషి**ముఖ్య అతిథి ఎం.ఎ. హజార్ వహబ్ మాట్లాడుతూ, సంఘ సభ్యుల ఆరోగ్య కార్డులు, అంత్యోదయ కార్డులు, నేతన్న భరోసా పథకాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. సభ్యుల ఆరోగ్యం కోసం త్వరలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయిస్తానని, ప్రభుత్వ పథకాల అమలుకు ఎల్లప్పుడూ సహకరిస్తానని భరోసా ఇచ్చారు.ఈ సభలో, అసిస్టెంట్ మేనేజర్ కొటిలింగం 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక నివేదికలు మరియు 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. సభ్యుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 19 తీర్మానాలను కూడా మహాసభ ఆమోదించింది.సభ చివరిలో, ఉత్పత్తి సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేయగా, గుండేటి మహదేవ్ ధన్యవాదాలు తెలియజేయడంతో మహాసభ ముగిసింది.

# నాగార్జున డేయిరీలో బతుకమ్మ సంబురాలు: అహల్య ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు...



**హుజురాబాద్,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):**హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో ఉన్న నాగార్జున డేయిరీ ఆవరణలో బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా డేయిరీ యాజమాన్యం తమ ఉద్యోగుల కోసం ఈ వేడుకను ఘనంగా నిర్వహించింది.ఈ కార్యక్రమాన్ని శ్రీమతి అహల్య ప్రభాకర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. సాధారణంగా డేయిరీ విధుల్లో నిమగ్నమై ఉండే మహిళా ఉద్యోగులు, ఈ వేడుకల్లో సంతోషంగా పాల్గొన్నారు. వారు అలంకరించిన అందమైన బతుకమ్మలను తీసుకుని ఆవరణలోకి చేరుకున్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, వాటిని మోసుకొచ్చిన మహిళలు ఆ ప్రాంతానికి మరింత శోభను తీసుకొచ్చారు.ఉద్యోగులందరూ కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాహలంగా ఆడిపాడారు. ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పుల్లూరి ప్రభాకర్ రావు, డైరెక్టర్ శ్రీమతి శృతి గణేష్ రావు, సీఈఓ కృష్ణ ప్రసాద్, ఏజీఎం ఆకునూరి సుధాకర్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. వీరు తమ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి ఆనందంలో పాలుపంచుకున్నారు.ఈ వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, ఉద్యోగులలో ఐకమత్యాన్ని, ఉత్సాహాన్ని పెంపొందించడానికి ఉపయోగపడ్డాయి. నాగార్జున డేయిరీ యాజమాన్యం తమ సిబ్బందికి సౌకర్యాలు కల్పించడంలో చూపిస్తున్న శ్రద్ధకు ఇది ఒక నిదర్శనం అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ సంబురాల సందడి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసిన ఆర్యవైశ్య సోదరులు





**గంగాధర సెప్టెంబర్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని గంగాధర మండల ఆర్యవైశ్య సోదరులందరూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గారిని మరియు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్కను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి గంగాధర మండల అధ్యక్షులు నలు మాచు హరి కిషన్, ప్రధాన కార్యదర్శి తంశెట్టి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు కంటాల రమేష్ ఉపాధ్యక్షులు రేగురి కరుణాకర్, జిల్లా హరికిషన్, వైశ్య సేవాదళ్ అధ్యక్షుడు దొంతుల వేణుగోపాల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బొల్లం ఆంజనేయులు, సహాయ కార్యదర్శి నార్లరాం,పెద్ది మల్లేశం, చిదుర మహేష్,తంశెట్టి పాపయ్య, మంచాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ మెంబర్ విశ్వనాథం నాగరాజు, వైశ్య భవన్ చైర్మన్ విశ్వనాథం రమేష్, ఇరుకుల్లా నాగార్జున,పెరక శ్రవణ్, వైదా రామానుజం, సదాల భాస్కర్, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చందుపట్ల వెంకటేష్ స్మారక రక్తదాన శిబిరం నిర్వహణ...





**హుజూరాబాద్,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ మండలం, పోతిరెడ్డిపేట గ్రామంలో చందుపట్ల వెంకటేష్ స్మారక రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. ఆలయ ఫౌండేషన్ సౌజన్యంతో, గ్రామ అభివృద్ధి కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.హుజూరాబాద్ టౌన్ సీఐ టీ. కరుణాకర్, డాక్టర్ తొగరు విద్యాసాగర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని దానాల్లోకెల్లా రక్తదానం అత్యుత్తమమైనదని, ఒక రక్తపు చుక్క అనేకమంది ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. ప్రజలు ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణాలను కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బీసీ సిటిజెన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వెంకటేష్ తండ్రి చందుపట్ల జనార్ధన్, గ్రామస్థులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రక్తదానం చేసిన దాతలందరికీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం కింద రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు దేవునూరి కిరణ్, ప్రధాన కార్యదర్శి కంకణాల పరశురాములు, మాజీ సర్పంచ్ చందుపట్ల పరంధాములు, ఆవుల రమేష్, దేవునూరి బాబు, రవీందర్, ఇతర గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డ్ అందుకున్న మదర్ డైరీ డైరెక్టర్ పాండు

**యాదాద్రి సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా ముల్కనూర్ లో మహిళా డైరీ నిర్వహించిన నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ ఎన్ డి డి బి స్థాపించి 60 వార్షికోత్సవంలో భాగంగా సభలో అత్యధిక పాల సేకరణ చేసిన యాదాద్రి భువనగిరి మండలంలోని బస్వాపు రం సొసైటీ తరపున (ఛైర్మెన్)మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పాండుకి ఉత్తమ బహుమతి ప్రదానం అందజేసిన ఎన్డిడిబి ప్రతిథినిది శ్రీధర్ సీఎస్ ముల్కనూర్ డైరీ ఛైర్మెన్ ధనశ్రీ విజయ డైరీ ఛైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. భువగిరి మేనేజర్ పి.దశరథ,కటిక జంగయ్య, పాల్గొన్నారు.

# విశ్వంలో ధర్మాన్ని కాపాడే, భగవంతుని శక్తి స్వరూపిణిగా దుర్గామాతని భావిస్తాం

**శరన్నవరాత్రులలో భాగంగా వెంకమ్మగూడ లో దుర్గమాత పూజా,అన్నప్రసాద కార్యక్రమం: పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**





షాద్ నగర్,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) : విశ్వంలో ధర్మాన్ని, నైతిక క్రమాన్ని కాపాడే శక్తిగా, భగవంతుని శక్తి స్వరూపిణిగా దుర్గమాతని భావిస్తామని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని వెంకమ్మ గూడ గ్రామంలో అమ్మవారి శరన్నవరాత్రులలో భాగంగా దుర్గ మాత మండపంలో ఏర్పాటు చేసిన పూజా, అన్నప్రసాద కార్యక్రమాలలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. పిఎసిఎస్ చైర్మన్ గొల్లపల్లి అశోక్ మాజీ చైర్మన్ మామిళ విట్టల్, బీఆర్ఎస్ నాయకులు బండ మల్లేష్, గుండాల శ్రీను, వేణు సమూలయ్య, జాలగూడెం శ్రీశైలం, బంటారం మల్లేష్ గౌడ్, వెంకటేష్, జంగయ్య, కుమ్మరి రాజు, అనిల్, శ్రీకాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

# పోషకాహారం వాటి ప్రాముఖ్యత కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

**సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు**

**పాల్గొన్న డిడబ్ల్యూఓ కృష్ణకుమారి, సిడిపిఓ రేఖల మమత, డాక్టర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు**






మిర్యాలగూడ,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) : మిర్యాలగూడ గవర్నమెంట్ కళాశాల యందు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సమాచారమంత్రిత్వ శాఖ నల్లగొండ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకాహారం వాటి ప్రాముఖ్యత గురించి ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ పోషకాహారం సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని అన్నారు. జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, కెమికల్ వేసిన పదార్థాలు తినవద్దని సూచించారు. అనంతరం అంగన్వాడి టీచర్స్ ప్రదర్శించిన బతుకమ్మలు, స్టాళ్లను పరిశీలించారు, సిరి ధాన్యాలతో చేసిన వంటలను, స్వయంగా తిన్నారు. బధిరుల పాఠశాల విద్యార్థుల కు. బహుమతులు. ప్రధానం చేశారు. అంగన్వాడీ టీచర్లకు కూడా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ కృష్ణకుమారి, సిడిపిఓ రేఖల మమత, డాక్టర్సు, అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు

# హెడ్జైన్ విల్లోవుడ్ నూతన ఉత్పాదకాల ఆవిష్కరణ

నంద్యాల:సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) : విల్లోవుడ్ కెమికల్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా బిజినెస్ పార్టనర్స్ సదస్సు ఘనంగా జరిగింది ఈ సందర్భంగా ఇండియా బిజినెస్ హెడ్ ఎస్ బి వి ఆర్ ప్రసాద్ , సౌత్ ఇండియా బిజినెస్ హెడ్ ఎస్ మైత్రి కుమార్ , సీనియర్ జోనల్ మేనేజర్ సురేష్ గౌడ్ మాట్లాడుతూ డీలర్ల సహాయ సహకారంతో కంపెనీ అనేక విజయాలు సాధించిందని భవిష్యత్తులో ఇలాగే సహకారం అంది ఇవ్వాలని కోరుతూ అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ అందరు కలిసి కొత్త ఉత్పాదనలు డాక్టర్ వెలాక్స్ , అబాక్సీ, టపెక్స్ 369 గురించి వివరించారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ రవీంద్రారెడ్డి, ఆర్ ఎం శ్రీనివాసులు మరియు నంద్యాల టీం పాల్గొన్నారు

# పేదల ఆత్మగౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు











**● రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ● ఖమ్మం జిల్లా, రూరల్ మండలం, ఆరేంపులలో పర్యటించి పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన**

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రాష్ట్ర ప్రభుత్వంచే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమా చార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రివర్యులు, బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆరెంపుల గ్రామంలో నిర్మించి పూర్తి చేసిన జెల్ల విజయ కుమారి, చెన్నబోయిన నరేష్, షేక్ నాగుల్ పాషా, చిర్ర రాజ్యం, సమర్థపు మమత, షేక్ రంజాన్ పాషా లకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు చిర్ర రాజ్యం ఇంట్లో మంత్రి, కలెక్టర్, సిపి లు భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. అధికారం, స్వార్థం కోసం కాకుండా పేద ప్రజల ఆత్మగౌరవం కోసం ఉపయోగపడాలనే తాపత్రయంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో గృహ నిర్మాణశాఖను తనకు కేటాయించడం జరిగిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో దివంగత వైఎస్ఆర్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు హౌసింగ్ కార్పోరేషన్ ను రద్దు చేశారని మంత్రి విమర్శించారు. పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. గత పాలకులు పేదల సొంతింటి నిర్మాణాలను పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేశారని, ధనార్జన కోసం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయంలోనే కూలిపోయిందని అన్నారు. గత పాలకులు చేసిన భారీ అప్పులు, కుదేలైన ఆర్థిక వ్యవస్థ ఉన్న సమయంలో తమ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. గిరిజన ప్రాంతంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం జరిగిందని, తర్వాత రాష్ట్రంలోనే పాలేరు నియోజకవర్గంలో నేడు గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల ముఖాలలో సంతోషం చూస్తే తనకు చాలా సంతృప్తి కలుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. 15 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ ప్రభుత్వ గిడ్డంగుల సంస్థ ద్వారా శంకుస్థాపన చేశామని, సన్న వడ్లకు క్వింటాకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల రైతుల రుణమాఫీ పూర్తి చేసామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఆరెంపుల గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో నేడు 6 గృహ ప్రవేశాలు మంత్రి చేతుల మీదుగా జరగడం సంతోష కరమని అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. మన ఖమ్మం జిల్లాలో మొదటి విడత క్రింద 16 వేల 300 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైతే 14 వేలకు పైగా ఇండ్లు మార్కింగ్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి మేరకు ప్రతి సోమవారం నిధులు చెల్లించడం జరుగుతుందని, మన జిల్లాలో ఇప్పటి వరకు 142 కోట్ల రూపాయలు 10 వేల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఖాతాలలో జమ చేశామని అన్నారు.అనంతరం ఆరెంపుల నుండి ఖమ్మం - వరంగల్ ఆర్ అండ్ బి రోడ్డు వయా యన్.డి.ఆర్. గోదాము వరకు 77 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పశు సంవర్ధక ఉప కేంద్రం నూతన భవనం, ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణాలకు,ఎం.పి.పి.ఎస్. ఆరెంపులలో 13.50 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసారు. తదనంతరం ఆరెంపుల జెడ్పీ హెచ్.ఎస్. పాఠశాల ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఎదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను, మంజూరైన నూతన రేషన్ కార్డులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు హరినాథ బాబు, వెన్నపూసల సీతారాములు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో శ్రీదేవి, ఎంఇఓ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు, పాల్గొన్నారు.

---

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ కార్యాచరణ



**● రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ● గిడ్డంగుల సంస్థ సామర్థ్యం మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల పెంపుకు చర్యలు ● సంవత్సరకాలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తి చేస్తాం ● ఖమ్మం రూరల్ మండలం యం. వెంకటాయపాలెంలో శీతల గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**





ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రివర్యులు, బుధవారం ఖమ్మం జిల్లా, రూరల్ మండలం యం. వెంకటాయపాలెం గ్రామంలో 15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 9 వేల 700 మెట్రిక్ టన్నుల శీతల గోదాముల నిర్మాణానికి జిల్లా కలెక్టర్, సిపి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 10 సంవత్సరాల కాలంలో గత పాలకులు గిడ్డంగుల సామర్థ్యం 3 లక్షల మెట్రిక్ టన్నుల పెంచితే, మన ప్రజా ప్రభుత్వం 5 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులు చేపట్టిందని, రాబోయే 3 సంవత్సరాలలో వీటిని పూర్తి చేస్తామని అన్నారు. గిడ్డంగుల సంస్థ ద్వారా గతంలో ఎన్నడు లేని విధంగా మొట్టమొదటిసారిగా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, 9700 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కోల్డ్ స్టోరేజ్ ను 15 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, సంవత్సర కాలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తి చేసి, వాణిజ్య పంటలు పండించే రైతన్నలకు ప్రైవేటు కంటే అతి చౌకగా కోల్డ్ స్టోరేజ్ అందుబాటు లోకి తీసుకుని వస్తామని అన్నారు.రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయలు రైతుల రుణమాఫీ పూర్తి చేసామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతులను రాజు చేయడమే లక్ష్యంగా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నా మని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల యూరియా సమస్య ఏర్పడితే ఢిల్లీలో రైతుల పక్షాన పోరాటం చేసి రైతులకు యూరియా సరఫరా చేసామని, రాబోయే వారం రోజులలో యూరియా సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను మోసం చేస్తే మన ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో మొదటి విడతలో 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన అర్హులకు కూడా తదుపరి విడతల్లో తప్పని సరిగా ఇండ్లు మంజూరు చేస్తామని, మరో 3 సార్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధులు బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్నామని అన్నారు. అర్హులైన నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. 15 కోట్ల అంచనాతో చేపట్టిన కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకోవడం సంతోషకరమని, కోల్డ్ స్టోరేజ్ కోసం అవసరమైన 10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని, మంత్రి ఆదేశాల మేరకు కోల్డ్ స్టోరేజ్ కు డబుల్ లైన్ రోడ్డు అనుసంధానం చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంతో స్థానికంగా రైతులకు మేలు జరుగుతుందని, ఉద్యానవన శాఖ పంటల ఉత్పత్తి పెరుగుతుందని, మిర్చి రైతులకు కూడా కోల్డ్ స్టోరేజ్ ఉపయోగ పడుతుందని అన్నారు. రైతులు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం కానున్న నేపథ్యంలో పంటల మార్పిడి విధానం అమలు చేయాలని, లాభాదాయక పంటల సాగు వైపు దృష్టి సారించాలని అన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. గిడ్డంగుల శాఖ ఆధ్వర్యంలో పెద్ద గోడౌన్ రైతులకు అందుబాటులోకి వచ్చి భవిష్యత్తులో రైతులు మార్కెట్లో పంట మంచి ధర సాధించేందుకు కోల్డ్ స్టోరేజ్ మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంతో ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు పడతాయని సిపి ఆకాంక్షించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. స్థానిక రైతులకు ఉపయోగపడే విధంగా కార్పోరేషన్ చరిత్రలో మొట్టమొదటి సారిగా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో ఉపయోగించు కోవాలని అన్నారు. మంత్రి సూచనల మేరకు రాష్ట్రంలో మరో 5 లక్షల టన్నుల గోదాములు నిర్మించి గిడ్డంగుల సంస్థ సామర్థ్యం 10 లక్షల టన్నులకు పెంచేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే మూడు లక్షల టన్నుల గోదాములు నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండి కొర్ర లక్ష్మీ, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్





**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ అని, జిల్లాలో ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించడం కోసం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు,బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుండి 30 వరకు తెలంగాణ ఆడపడుచుల పండగ బతుకమ్మ వేడుకలు అధికారికంగా నిర్వహించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని జిల్లాలలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్ జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఏర్పాట్లు చేయాలని, బతుకమ్మ ఆడే ప్రదేశాలు చెరువులు కుంటలు దేవాలయాలు తదితర ప్రదేశాలలో ప్రభుత్వం సూచించిన ప్రకారం విద్యుత్ కాంతులతో సకల ఏర్పాట్లను చేయాలని సంబంధిత మున్సిపల్, పంచాయతీరాజ్, అన్ని విభాగాల సిబ్బందిని ఆయన ఆదేశించారు,దుర్గామాత విగ్రహాల నిమజ్జనం కోసం సూచించిన ప్రదేశాలలో క్రేన్స్ లైటింగ్ శానిటేషన్ రక్షణ( బందోబస్తు) ఏర్పాటు చేయాలని, మహిళలకు వేడుకలకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు, స్త్రీ శిశు సంక్షేమ, మహిళా భద్రత, సఖి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మెప్మా, స్వయం సహాయక బృందాలు, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ తదితర విభాగాల సంక్షేమ పథకాలు అమలు ప్రదర్శన ద్వారా బతుకమ్మ ఆటలు ఘనంగా నిర్వహించాలని సంబంధిత విభాగాలను ఆయన ఆదేశించారు,వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు తదితరులకు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని, క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని, జిల్లాలోని ప్రతి ఒక్కరినీ , స్వచ్ఛంద సంస్థలను అన్ని వర్గాల వారిని ఈ వేడుకలలో భాగస్వామ్యులను చేయాలన్నారు,కలెక్టరేట్లోని అన్ని విభాగాల వారు పక్కా ప్రణాళికతో బతుకమ్మ పండుగ నిర్వహించుకోవాలని సూచించారు జిల్లాలోని తెలంగాణ సాంస్కృతిక సారధి సభ్యులచే ఇతర కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి తిరుపతిరావు, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా హార్టికల్చర్ అధికారి మరియన్న, డిపిఓ హరిప్రసాద్, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, అని విభాగాల జిల్లా అధికారులు, సెక్షన్ పర్యవేక్షకులు రాఘవరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**ఖానాపూరం సెప్టెంబర్ 24,(పీసీడబ్ల్యూ న్యూస్):** నాజి తండా గ్రామంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారంగా, ఖానాపురం మండల అధ్యక్షులు శాఖమూరి హరిబాబు. నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి. సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి కున్ సోతు రంగమ్మ భర్త రామ్ చంద్ కి, రూ. 60,000 లూ చెక్కును నాజీ తండా కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందించడం జరిగింది.


## పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలి



**హన్మకొండ,సెప్టెంబర్ 24, (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మండలాలలో మండల పంచాయతీ కార్యాలయంలో నాలుగు నెలల జీతాలు లేక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు చివరికి ఆ బాధ తట్టుకోలేక పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఆత్మహత్య చేసుకుంటున్నరని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బయ్యాగోని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మాటికి ఇవి ప్రభుత్వ హత్యలే అని మండిపడ్డారు మొన్నటికి మొన్న సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి మండల కేంద్రం లోని సోమిరెడ్డి అనే యువకుడు 3 నెలల జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితి ఆర్థిక సమస్యల వల్లే కంప్యూటర్ ఆపరేటర్లు జీతాలు లేక తమ కుటుంబాలను పోషించుకోలేని దయామని స్థితిలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేరుస్తూ తక్షణమే మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని మరణించిన కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహాయం చేకూర్చాలని మరోసారి ప్రభుత్వ ఉద్యోగాల్లో వేతనాల ఆలస్యాలు ఎంతటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తున్నాయో సమాజంలో ఇలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కేశవపట్నం బస్టాండ్‌లో కార్గో సేవలు ప్రారంభం...





**కేశవపట్నం,సెప్టెంబర్24(పీసీడబ్ల్యూ న్యూస్):**హుజురాబాద్ డిపో పరిధిలోని కేశవపట్నం బస్టాండ్‌లో బుధవారం కార్గో సేవలను డిపో మేనేజర్ వి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిరు వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉండేలా కార్గో సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సారయ్య, టి.ఐ. త్రి పి.వి. సాగర్, కరీంనగర్ వన్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అన్వేష్, హుజురాబాద్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ చంద్రమౌళి, ట్రాఫిక్ గైడ్ పీహెచ్. రావు, మాజీ సర్పంచ్ దొంగల రాములు, మాజీ సర్పంచ్ కాటం శివారెడ్డి, కొరిమి వెంకటస్వామి, బుర్ల మొగిలి, గరిగే కోటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అండర్-15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు తాటిగూడెం యువతి

● సభ్యురాలుగా దేవి ప్రియ ఎంపిక ● హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 24,(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అండర్ -15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం తాటి గూడెం గ్రామానికి చెందిన బాలిక రామటెంకి దేవి ప్రియ ఎంపికైంది.చదువుతు క్రికెట్ లో సత్తా సాటి,తెలంగాణ అండర్-15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు ఎంపిక అవ్వడం పట్ల తల్లిదండ్రులు హనుమంతరావు, ఉమామహేశ్వరి సంతోషం వ్యక్తం పరిచారు.తండ్రికి క్రికెట్ అంటే చాలా ఇష్టం.క్రికెట్ ఆడుతూ పట్టుదలతో పోటి పరీక్షల్లో సత్తా సాటి ఉపాధ్యాయుడు అయ్యాడు.తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయినా తనలో క్రికెట్ అనే ఆశ అలాగనే ఉండిపోయింది.తన కూతురున్ని దేవి ప్రియ క్రికెట్ ప్లేయర్ చేయాలని నిర్ణయించుకున్నాడు.తండ్రి ప్రోత్సాహంతో హైదరాబాద్ లో నిర్వహించిన మహిళ క్రికెట్ అండర్-15 సెలక్షన్ లో దేవి ప్రియ ఎంపికయ్యింది.హెడ్ కోచ్ సురేందర్ రెడ్డి,కోచ్ లు వెంకట్ యాదవ్,బుచ్చిబాబు,రంజి కోచ్ ఇర్ఫాన్ సైతం ప్రత్యేకంగా అభినందించారు.కరకగూడెం మండాలనికి,తెలంగాణ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.మారుమూల ప్రాంతంలో పుట్టిన దేవి ప్రియ అండర్ -15 మహిళ క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు ఎంపిక కావడం పట్ల భద్రాద్రి జిల్లా క్రికెట్ సంఘాలు,గ్రామస్తులు,రాజకీయ నాయకులు, నేతకానీ కులస్తులు ప్రత్యేకంగా అభినంధించారు.

## బీసీ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహ ఏర్పాటు

- మున్సిపల్ కమిషనర్‌కు మరోసారి వినతిపత్రం

జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

**నర్సంపేట సెప్టెంబర్ 24,(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాన్ని నెహ్రూ పార్కు దగ్గర సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే జంక్షన్ వద్ద ఉన్న డివైడర్ వద్ద ఏర్పాటు చేసుకోవడానికి బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మరియు కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఓబిసి చైర్మన్ ఓర్సు తిరుపతి ల ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కు మరోసారి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని నెహ్రూ పార్కు దగ్గర సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా జ్యోతిరావు పూలే జంక్షన్ వద్ద గత కొన్ని సంవత్సరాలుగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే దంపతుల జయంతి, వర్ధంతులతో పాటు పలు సామాజిక ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆ ప్రాంగణాన్ని జ్యోతిరావు పూలే జంక్షన్ గా నామకరణం చేయడం జరిగిందని అన్నారు. పూలే దంపతుల విగ్రహా ఏర్పాటు కోసం గతంలో అనగా 26 అక్టోబర్ 20 అక్టోబర్ 2024 న నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. కావున భవిష్యత్తు తరాలు స్ఫూర్తిని ఇచ్చే మహనీయులైన జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహా స్థాపన ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఓబిసి చైర్మన్ కోర్సు తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి కురిమిల్ల రమేష్, వరంగల్ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు కడారి సురేష్ యాదవ్, చెన్నారావుపేట మండల అధ్యక్షులు బర్ల యాకయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ యూత్ అధ్యక్షుడు గోపగాని నాగరాజు గౌడ్, మంగిశెట్టి సారంగం, శీరంశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక 'బతుకమ్మ పండుగ'

● నగర మేయర్ పునుకొల్లు నీరజ ● ఘనంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో నానే బియ్యం బతుకమ్మ వేడుకలు








**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక అని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో నానే బియ్యం బతుకమ్మ వేడుకలను తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా ఘనంగా నిర్వహించారు.నాల్గవ రోజు బుధవారం సాయంత్రం పూల పండుగ బతుకమ్మ వేడుకలలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో పూలతో పేర్చిన బతుకమ్మలతో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కార్పొరేషన్, మెప్మా, మునిసిపాలిటీలకు చెందిన మహిళలు పెద్దఎత్తున పాల్గొని గౌరమ్మ తల్లిని పూజించి, బతుకమ్మలను పేర్చి ఆట, పాటలతో సందడి చేస్తూ బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ పూలను కొలిచే పండగ అని అన్నారు. మహిళల సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక బతుకమ్మ అని అన్నారు. పూలతో తయారు చేసిన బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక అని, బతుకమ్మ పాటలు మన ఆత్మీయతను, పరంపరలను కొత్త తరాలకు చేరవేసే శక్తివంతమైన సాధనం అని తెలిపారు. ఈ వేడుకల్లో నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, మహిళా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

● జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ● గెజిటెడ్ అధికారుల బతుకమ్మ సంబరాల పోస్టర్ ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :**బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు.తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల పోస్టర్ ను బుధవారం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని గెజిటెడ్ అధికారులు బతుకమ్మ పండుగను సంబరంగా జరుపుకోవాలని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగానికి ఖమ్మం జిల్లా నుండి వైస్ కో-చైర్ పర్సన్ గా పి. సుధారాణి, వైస్ చైర్ పర్సన్ లుగా గంగవరపు ఉషశ్రీ, విజయకుమారి లు ఎన్నికైన సందర్భంగా వారికి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరంపల్లి రాంబాబు, మహిళ గెజిటెడ్ అధికారులు సరళ, ఉదయశ్రీ, స్వాతి, లావణ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారావుపేట బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభం

**● మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి**
**● బిఆర్ఎస్ మండల పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు నాయకులకు పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు ● రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు**



**చెన్నారావు పేట సెప్టెంబర్ 24, (పీసీడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ మండల పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు నాయకులకు పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు, నాయకులు,కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు మార్పులో భాగంగా నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా దొంతి మాధవ రెడ్డి గారిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి అదో గతిపాలైంది.బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు శాసనసభ్యునిగా నేను స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీలు, సర్పంచులు మరియు జెడ్పిటిసిలు గెలిపించుకోవడంతో పాటు చెన్నారావుపేట మండల సమగ్ర అభివృద్ధికి ఒక విజన్ తో ప్రణాళిక బద్ధంగా పనిచేసినాము.మండలంలోని అనేక గిరిజన తండాలకు గ్రామాలకు బీటీ రోడ్లు,సీసీ రోడ్డు,రైతువేదికలు, హెల్త్ సబ్ సెంటర్స్ లాంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామాల మౌలిక వసతులను అభివృద్ధి చేసినాము.ప్రత్యేక నిధులతో చేన్నా రావుపేట మండలంలో బ్రిడ్జిలను చెక్ డ్యాములను డబుల్ రోడ్లను,సెంట్రల్ లైటింగ్ మంజూరు చేసినాము. మండల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవతో ఎస్ డి ఆఫ్ నిధుల తీసుకువస్తే ,గెలిచిన ఎమ్మెల్యే వాటిని రద్దు చేసిండు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నర్సంపేట నియోజకవర్గం లో దాడులు ,దౌర్జన్యాలు కబ్జాలు, కమిషన్లు కేసులు,కార్ల కాన్వాయ్ తప్ప అభివృద్ధి శూన్యం రైతులకు 50% సబ్సిడీ పైన వ్యవసాయ పరికరాలను అందించే పథకం తీసుకువస్తే నా పైన కాంగ్రెస్ నాయకులు కేసులు పెట్టారు.నేను తీసుకువచ్చిన నిధులతోనే నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నది ఆ నిధులతోనే కొత్త జీవోలు తీసుకువస్తున్నారు. రైతులకు యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందీ. యూరియా బస్తాలు కోసం చిన్నపిల్లాలు ,మహిళలు,రైతులను నెలల తరబడి క్యూలైన్లో నిలబెట్టినారు. రైతులకు యూరియా సరిపడ అందక పంటల దిగుబడి కోల్పోయారు.పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ శ్రేణులు కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేసి చేన్నారావుపేట మండల పై గులాబీ జెండా ఎగరవేయాలని సూచించారు. ఆర్ ఎస్ ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ మాజీ జెడ్పిటిసి పిఎసిఎస్ చైర్మన్లు,డైరెక్టర్లు, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లు,ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు,యూత్ నాయకులు,మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు గ్రామ పార్టీ అధ్యక్షులు అనుబంధ సంఘాల నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జట్టులో మన జిల్లా క్రీడాకారులు స్థానం సంపాదించాలి





**మహబూబాబాద్ జిల్లా జట్లు విజేతలుగా నిలవాలి...**

**కురవి వీరన్న ఆలయంలో జిల్లా జట్ల ప్రత్యేకపూజలు**

**టియుడబ్ల్యూజే (ఐజేయు)మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిత్తనూరి సిహెచ్ శ్రీనివాస్**

**కురవి సెప్టెంబర్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలలో మహబూబాబాద్ జిల్లా జట్లు విజేతలుగా నిలవాలని, మన జిల్లా క్రీడాకారులు రాష్ట్రజట్టులో మంచి స్థానాలను సాధించాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా బాలుర, బాలికల కబడ్డీ సబ్ జూనియర్ జట్ల కోచింగ్ క్యాంప్ కురవిలో ముగిసింది. ఈ.. సందర్భంగా కురవిలోని శ్రీభద్రకాళిసమేత వీరభద్రస్వామివారి ఆలయంలో బుదవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా జట్లు మంచి ఫలితాలు సాధించాలని అర్చకులు ఆశీస్సులు అందజేసారు. అనంతరం టియుడబ్ల్యూజే( ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... మట్టిలో మాణిక్యాలను వెలికితీసినట్లుగా, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసి, మెరుగైన శిక్షణను అందించి, రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకువెళుతున్న మహబూబాబాద్ జిల్లా కబడ్డి అసోసియేషన్ ను ప్రత్యేకంగా అభినందించారు. మీ..కృషి ఫలితంగా అనేకమందికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, శ్రమను, ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా కబడ్డీ అసోసియేషన్ చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ అభినందించి తీరాల్సిందే అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి క్రీడాకార్యక్రమాలు కురవి మండలకేంద్రం వేదిక కావాలని కోరారు. రాష్ట్రస్థాయి జట్టులో మన జిల్లా క్రీడాకారులు స్థానం సంపాదించాలని, వారిని ఘనంగా సన్మానించుకుందా మని శ్రీనివాస్ అన్నారు. రెండు జట్ల నుంచి 28 మంది బాల, బాలికలు నిజామాబాద్ జిల్లా మక్తల్ లో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు కురవి వీరన్న ఆశీస్సులు తీసుకుని బయలుదేరారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంద వీరన్న, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు గుమ్మళ్ళ సురేందర్, మేక దామోదర్ రెడ్డి, కోచ్ లు నూకల అన్వేష్, అఖిల్, వ్యాయామ ఉపాధ్యాయులు చాంప్లానాయక్, అనీల్ పాల్గొన్నారు.

# రాఘవేంద్ర కాలనీలో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు



**మూడవరోజు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చిన దుర్గామాత**

**అమ్మవారిని దర్శించుకున్న షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్**

**దర్శనానంతరం శాలువాలతో సన్మానించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వావిలాల సుజీవన్**





**షాద్ నగర్,సెప్టెంబర్ 24(పి.సి.డబ్ల్యూ న్యూస్):** శరన్నవరాత్రులలో భాగంగా ఒక్కొక్క రోజు ఒక్కొక్క అవతారంలో అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ దుర్గమ్మ ఈ నవరాత్రుల వేళ.. వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి వేళ.. అమ్మ వారిని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయంటారు. ప్రతి ఏటా నవరాత్రులు తొమ్మిది రోజులు పాటు జరుపుతారు.. నవరాత్రులలో భాగంగా అమ్మవారు ఒక్కొక్క రోజు ఒక్కొక్క రూపంలో దర్శనమిస్తారు. అయితే మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారు.. శక్తి, సంపదతోపాటు ఆహారానికి ప్రతీకగా భావిస్తారు. అమ్మ వారికి కొబ్బరి అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే అన్నం, నెయ్యి, కూరగాయలతో చేసిన భోజనం, లడ్డూ, గారెలు, పులిహోర నైవేద్యంగా పెడతారు. అయితే గత 20 సంవత్సరాలుగా దుర్గాదేవి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తూ అమ్మవారి కరుణాకటాక్షాలను పొందుతున్నారు షాద్ నగర్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మరియు మాజీ వార్డ్ కౌన్సిలర్ వావిలాల సుజీవన్ అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా ఈరోజు షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ మరియు షాద్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఏసిపి లక్ష్మీనారాయణకు, మరియు సీఐ విజయకుమార్ కు అమ్మవారి సన్నిధిలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బావిలాల సుజీవన్ మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలు ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయకుమార్ కుటుంబాలపై ఎల్లవేళలా ఉండాలని ప్రముఖ అర్చకుడు రాజశేఖర్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించి వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా జరుగుతాయని ఎక్కడ ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగాలని కోరుకుంటున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఎవరైనా అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే తమకు తెలియజేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో దామోదర్ యాదవ్, రాయికల్ శ్రీనివాస్, రమేష్, మంతెన రమేష్, అన్నయ్య, పాల్గొన్నారు.




## పరకాల ఆర్టీసీ ప్రయాణికుల కోసం

# లక్కీ డ్రా

**పరకాల, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాలలో దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు పరకాల డిపో మేనేజర్ జి. రాంప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 6 వరకు అన్ని సెమి డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఎ.సి. లో ప్రయాణించేవారు టికెట్ పై పేరు, ఫోన్ నెంబర్ మరియు చిరునామా రాసి బాక్స్ లో వేయాలన్నారు. అక్టోబర్ 8న లక్కీ డ్రా తీస్తారని, విజేతలకు మొదటి బహుమతిగా రూ. 25000 వేలు, రెండవ బహుమతిగా రూ.15000 వేలు, మూడవ బహుమతిగా రూ.10000 నగదు బహుమతులు లభిస్తాయన్నారు. ఈ బహుమతులు వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలకు కలిపి వరంగల్ రిజియన్ ఆఫీసులో ముగ్గురిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి పైన పేర్కొన్న బహుమతులు ఇవ్వబడును అని డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



# తాగి వాహనం నడిపి.. ప్రమాదం సంభవిస్తే? మీ కుటుంబాలకు బాధ్యులు ఎవరు?

**● ఎస్సై విఠల్ ప్రశ్న**



**పరకాల, సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం. అలాంటి సందర్భాల్లో ఏదైనా ప్రమాదం సంభవించి ప్రాణాలు కోల్పోతే వారికి ఆసరా ఎవరు అంటూ పరకాల ఎస్ఐ విఠల్ అన్నారు. బుధవారం ఆయన పరకాలలోని వెల్లంపల్లి రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పలువురు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తో ప్రయాణిస్తున్న వాహనదారులకు కౌన్సిలింగ్ చేశారు. వాహనాలు నడిపేవారు మద్యం సేవించి ప్రయాణాలు చేయడం తమ కుటుంబాలను అనాథలుగా మార్చడం లాంటిదని సూచించారు. అలాంటి దుర్ఘటనల సందర్భాలలో వారిని కంటి రెప్పల కాపాడుకునేవారు కరువవుతారని హెచ్చరించారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఎస్సై తో పాటు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# బీఎస్ ఎన్ ఎల్ నుండి అద్భుతమైన ఆఫర్లు!

**● 299/- కే ఇంటర్నెట్, టీవీ చానళ్లు మరియు ఉచిత కాల్స్: సబ్ డివిజనల్ ఇంజనీర్ మధుకర్**



**యాదాద్రి,సెప్టెంబర్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ బీ ఎస్ ఎన్ ఎల్ నుండి ఇంటర్నెట్ మరియు టీవీ వినియోగదారులకు అతి తక్కువ ధరలో ఆకర్షణీయమైన ఫైబర్ ప్లాన్స్ విడుదల చేసిందని యాదాద్రి భువనగిరి జిల్లా సబ్ డివిజనల్ ఇంజనీర్ గూడ మధుకర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ భారత్ లో భాగంగా, వినియోగదారులకు ఇంటర్నెట్, టీవీ చానెల్స్ మరియు ల్యాండ్ లైన్ ఫోన్ ను కేవలం నెలకు ?299/-కే అందచేస్తున్నట్లు తెలిపారు. దీంట్లో 460 టీవీ చానెళ్లు, తెలుగు టీవీ చానెళ్లు, 20ఎంబి పి ఎస్ ఇంటర్నెట్ 500జీబీ డేటా మరియు ఉచిత అన్లిమిటెడ్ కాల్స్ కూడా అందచేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు 9 ఓటిటి లు కల మరొక ప్లాన్ ?399/-కే అందుబాటులో ఉందని తెలిపారు.బీఎస్ ఎన్ ఎల్ కనెక్షన్ పూర్తిగా సురక్షిత మైనదని పేర్కొంటూ,6 నెలలు మరియు వార్షిక ప్లాన్స్ కూడా అవసరాలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.నల్గొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ఓ ఎల్ టీ లు ఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీ కోసం లోకల్ కేబుల్ ఆపరేటర్లు తమను సంప్రదించవచ్చని తెలిపారు. తక్కువ ధరకే అన్ని సౌకర్యాలు కలిపి వున్న బీఎస్ఎన్ఎల్ కనెక్షన్స్ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా 1800 4444 ను సంప్రదించవచ్చని తెలిపారు.

# పవన్ అభిమానుల సందడే సందడి

## ఐమాక్స్ వద్ద భారీ కటౌట్‌తో హంగామా




హైదరాబాద్ ప్రసాద్ ఐమాక్స్ వద్ద పవన్ కల్యాణ్ అభిమానులు సందడి చేశారు. పవన్ నటించిన ఓజీ గురువారం విడుదల కానున్న సందర్భంగా అభిమానులు ఐమాక్స్ వద్ద భారీ కటౌట్‌ను ఏర్పాటు- చేసి బాణాసంచా వెలుగుల్లో దాన్ని ఆవిష్కరించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ప్రసాద్ ఐమాక్స్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మరోవైపు బుధవారం రాత్రి 10 గంటల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓజీ ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ యాక్షన్ మూవీ ఓజి సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ప్రీమియర్ షోస్ టికెట్స్ కు ఎక్కడాలేని డిమాండ్ ఉంది. మరి ముఖ్యంగా నైజాంలో ఒక్కో టికెట్ రూ. 1200 నుండి రూ. 2000 వరకు పలుకుతోందట. పవర్ స్టార్ కొడుకు అకిరా నందన్ క్షవ సినిమాను ఎక్కడ చూడబోతు న్నాడు అనే క్యూరియాసిటీ- అందరిలోనూ నెలకొంది. అకిరా హైదరాబాద్ బాలానగర్ లో ఉన్న మైత్రి విమల్ థియేటర్ లో చూడబోతున్నాడు. అకిరాతో పాటు- దర్శక దిగ్గజం రాజమౌళి, కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కూడా ఈ ప్రీమియర్ కు రాబోతున్నాట్టు- తెలుస్తోంది. అకిరా వస్తుండడంతో ఈ ప్రీమియర్ ను భారీ స్థాయిలో సెలెబ్రేట్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు పవర్ స్టార్ అభిమానులు. మరోవైపు అనకాపల్లి నుండి అమెరికా వరకు ఓజి సెలెబ్రేషన్స్ ను కనివిని ఎరుగని రీతిలో చేస్తున్నారు ఫ్యాన్స్. వింటేజ్ పవన్ కళ్యాణ్ ను మరోసారి సిల్వర్ స్క్రీన్ పై చూడబోతున్నామని ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు.

## సాయిపల్లవికి కలైమామణి పురస్కారం





తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కలైమామణి పురస్కారాలను బుధవారం ప్రకటించింది. సాయి పల్లవి, ఏస్‌జే సూర్యలతో పాటు- మరో 90 మందికి ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించింది. కళారంగంలో ప్రతిభ కనబరుస్తోన్న వారికి ప్రతి ఏడాది ఈ పురస్కారాలను అందిస్తారు. 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను ఏడాదికి 30 మందికి చొప్పున బుధవారం 90 మంది కళాకారులకు ప్రభుత్వం కలైమామణి అవార్డులు
ప్రకటించింది. 2021 సంవత్సరానికి గాను నటి సాయిపల్లవి, నటుడు, దర్శకుడు ఎస్.జె.సూర్య సహా ఐదుగురు అవార్డును సొంతం చేసుకున్నారు. 2023కు సంగీత దర్శకుడు అనిరుధ్‌తో పాటు- మరో ఆరుగురు కలైమామణి పురస్కారాన్ని అందుకోనున్నారు. జాతీయ పురస్కారాల విభాగంలో ప్రముఖ నేపథ్య గాయకుడు కె.జె.ఏసుదాస్‌కు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పురస్కారాన్ని ప్రకటించారు. అక్టోబరులో ఈ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది.




## తేజ సజ్జాపై అల్లు అర్జున్ ప్రశంసలు

యువ హీరో తేజ సజ్జా నటించిన 'మిరాయ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, ఇప్పుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నుంచి ప్రశంసలు అందుకుంటోంది. ఈ సినిమాపై, చిత్ర బృందంపై బన్నీ ట్విట్టర్ వేదికగా అభినందనల వర్షం కురిపించారు. ఈ విజయం 'మిరాయ్' టీమ్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది."మిరాయ్ టీంకు అభినందనలు! సినిమా అద్భుతంగా ఉంది. తేజ సజ్జా, నీ కష్టానికి, డెడికేషన్‌కి హ్యాట్సాఫ్. ఇలాంటి సినిమాలు చేయడం చిన్న విషయం కాదు" అని అల్లు అర్జున్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దర్శకుడు కార్తిక్ ఘట్టమనేనిని 'న్యూ ఏజ్ కమర్షియల్ డైరెక్టర్'గా అభివర్ణించారు. చిత్రంలోని కీలక పాత్రల్లో నటించిన మంచు మనోజ్, రితికా నాయక్, శ్రియా శరన్, జగపతిబాబులను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సినిమా సాంకేతిక విభాగాల పనితీరును కూడా బన్నీ మెచ్చుకున్నారు. సీజీ వర్క్, ఆర్ట్ డైరెక్షన్, గౌర హరి సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. నిర్మాత టి.జి. విశ్వ ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి శుభాకాంక్షలు తెలియజేశారు.సెప్టెంబర్ 12న విడుదలైన 'మిరాయ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతోంది. సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ కథాంశంతో వచ్చిన ఈ సినిమా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 130 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, రూ. 140 కోట్ల మార్కు దిశగా దూసుకెళ్తోంది. ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్, హాలీవుడ్ స్థాయి విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన కార్తిక్ ఘట్టమనేని కథనాన్ని నడిపించిన తీరుపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు తేజ సజ్జా కెరీర్‌లోనే ఇది అతిపెద్ద హిట్‌గా నిలవనుంది. ఈ సినిమాతో తేజ నటుడిగా తనలోని విభిన్న కోణాలను ఆవిష్కరించారని అభిమానులు సోషల్ మీడియాలో కొనియాడుతున్నారు

## బాలీవుడ్ లో బిజీగా మారిన మిల్కీ బ్యూటీ



హీరోలకు ఉన్నట్టు హీరోయిన్లకు సినీ ఇండస్ట్రీలో కెరీర్ లాంగ్ రన్ ఉండదు. హీరోయిన్ల కెరీర్ ఇండస్ట్రీలో చాలా తక్కువ సంవత్సరాలే ఉంటుంది. హీరోల్లాగా వయసు మీద పడినా వారికి అవకాశాలు రావు. అందుకే వయసు, అవకాశాలు ఉన్నప్పుడే జాగ్రత్తపడి ఖాళీ లేకుండా సినిమాలు చేస్తూనే ఉంటారు. వయసు మీద పడేకొద్దీ హీరోయిన్ల అందంతో పాటూ అవకాశాలు కూడా తగ్గుతూ వస్తాయి. తమన్నా ఫోకస్ అంతా దానిపైనే! కానీ 35 ఏళ్ల వయసులో కూడా మిల్కీ బ్యూటీ తమన్నా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. గతంలో ఎప్పుడూ లేనిది గ్లామర్ టచ్ ఉన్న క్యారెక్టర్లు చేయడానికి సిద్ధమై, వాటిపైనే ఇప్పుడు తన ఫోకస్ ను పెట్టారు తమన్నా. ఓ వైపు గ్లామర్ రోల్స్ చేస్తూనే మరోవైపు స్పెషల్ నెంబర్లు, ఐటెం సాంగ్స్ లో నటించడానికి కూడా ఎలాంటి లిమిట్స్ పెట్టుకోకుండా కెరీర్లో దూసుకెళ్తున్నారు. ఐటెం సాంగ్ కు ఫస్ట్ ఆప్షన్ గా మారిన తమన్నా తమన్నా చేసిన స్పెషల్ సాంగ్స్ అన్నీ చార్ట్‌బస్టర్లుగా మారిన నేపథ్యంలో ఏ భారీ సినిమాలో ఐటెం సాంగ్ చేయాలన్నా అందరికీ ముందు ఆప్షన్ గా తమన్నానే కనిపిస్తున్నారు. తమన్నా తోటి హీరోయిన్లు ఆఫర్లు అందుకోవడానికి ఇబ్బంది పడుతుంటే, అమ్మడు మాత్రం బాలీవుడ్ లో సినిమాలు, సాంగ్స్, వెబ్‌సిరీస్‌లు చేస్తూ బిజీగా ఉన్నారు. రెమ్యూనరేషన్ డిమాండ్ చేసినా.. రైడ్2లో నషా, ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ లోని గఫూర్ సాంగ్స్ ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్లుగా నిలవడంతో తమన్నా బాగా ఫేమస్ అయ్యారు. గతంలో ఎప్పుడూ లేనంత హాట్ గా తమన్నా కనిపించడంతో ఆమె వీడియోలన్నీ నెట్టింట బాగా వైరల్ అయ్యాయి. పైగా తమన్నా మంచి డ్యాన్సర్ తో పాటూ అందగత్తె కూడా. ఫిట్‌నెస్ విషయంలో ఆమె ఎంతో కేర్ తీసుకోవడం వల్ల స్క్రీన్ పై కూడా తమన్నా చాలా హాట్ గా కనిపిస్తుంటారు. దానికి తోడు ఎక్స్‌పోజింగ్ విషయంలోనూ ఎలాంటి పరిమితులు లేవు. ఇన్ని క్వాలిటీస్ ఉండబట్టే తమన్నా రెమ్యూనరేషన్ విషయంలో భారీగా డిమాండ్ చేసినా అమ్మడు అడిగినంత ఇవ్వడానికి నిర్మాతలు కూడా రెడీ అవుతున్నారు. ప్రస్తుతం బాలీవుడ్ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న తమన్నా కొత్తగా ఏ తెలుగు సినిమాకీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది లేదు.



## నాగ్ వందో సినిమాపై సర్వత్రా చర్చ

### తమిళ డైరెక్టర్ రా కార్తీక్ దర్శకత్వంలో అంటూ చక్కర్లు

ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగ్ ఇటీ-వలే కూలీ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన విషయం తెలిసిందే. ఇక నాగార్జున కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై కొత్త అప్‌డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని మూవీ లవర్స్‌తోపాటు- అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి కోసం నాగ్ వందో సినిమాకు సంబంధించిన క్రేజీ వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు కార్తీక్ డైరెక్ట్ చేయబోతున్నాడట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ఫిక్స్ అయినట్టు- సమాచారం. రాబోయే రోజుల్లో నాగ్ 100 సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలపై స్పష్టత రానుంది. యూనిక్ స్టోరీ -టె-ల్లింగ్, థ్రిల్లింగ్ కథనాలతో తనదైన మార్క్ చూపించే రా కార్తీక్ నాగార్జున కెరీర్ మైల్‌స్టోన్ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంతకీ రా కార్తీక్ నాగ్ కోసం ఎలాంటి కథను సిద్ధం చేశాడు. కూలీలో తొలిసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించిన నాగార్జున మరి రా కార్తీక్‌తో ఎలాంటి కథ చేయబోతున్నాడన్నది అందరిలో ఉత్కంఠ నెలకొంది.

## మిరాయ్ థియేటర్స్‌లో ఓజి సందడి




పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తోన్న ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం కోసం 'మిరాయ్' నిర్మాత విశ్వప్రసాద్ ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 12న తేజ సజ్జా నటించిన 'మిరాయ్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ చిత్రం ప్రదర్శితమవుతోన్న థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత విశ్వప్రసాద్ పవన్‌కల్యాణ్ కోసం గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 25న 'మిరాయ్' థియేటర్స్ కొన్నింటిలో 'ఓజీ'ని ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చారు. మళ్లీ సెప్టెంబర్ 26 నుంచి యధాతథంగా ఆ థియేటర్స్‌లో 'మిరాయ్'ను ప్రదర్శించనున్నారు. దీంతో విశ్వప్రసాద్ నిర్ణయంపై పవన్ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నార్త్ అమెరికాలో ఓజీ సినిమా డిజిటల్ ప్రింట్‌లు ఇంకా అందలేదని, కొన్ని కారణాల వల్ల కెనడాలో ఓజీ సినిమాను ప్రదర్శించడం లేదని ఇటీవల నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు వీటికి లైన్ క్లియరైంది. ప్రింట్‌లు అందినట్లు- డిస్ట్రిబ్యూటర్లు ఎక్స్ వేదికగా తెలిపారు.